

కరాపాడు రోడ్డులో పెన్సింగ్ అవస్థలు

విశాలాంధ్ర - కవిటి: కవిటి మండలం ఆర్.కరాపాడు గ్రామానికి వెళ్లే కంకర రోడ్డులో రైల్వే స్థలం ఉందని రోడ్డు మధ్య నుంచి ఇనుప కంచె కట్టడంతో రోడ్డు మూత పడిపోయిందని ఆ గ్రామానికి ఆ రోడ్డు తప్ప మరో మార్గం లేదని దీంతో ట్రాక్టర్లు, లారీలు వెళ్లేందుకు అంతరాయం కలుగుతుందని జెడ్ఆర్యుసిసి మెంబరు శ్రీనివాస రౌలో పలాస రైల్వే అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో అత్యవసర పరిస్థితి వస్తే కనీసం అంబులెన్స్ రావడం కూడా కష్టమని ఆ రోడ్డులో ఏర్పాట్లు చేసిన స్తంబాలు, కంచెను తొలగించాలని కోరారు. ఈ సమస్యపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బుగత వాసు, సంతోష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మా బడి మాకు కావాలి..

- గ్రామంలో బడికి తప్ప వేరే బడికి వెళ్ళలేం
- పాఠశాలను విలీనం చేయొద్దు
- బడికి సుమారు 30 నుండి 40 సంవత్సరాల చరిత్ర
- వచ్చే విద్యా సంవత్సరానికల్లా విద్యార్థుల సంఖ్య పెంచుతాం
- విద్యార్థులు... తల్లిదండ్రుల ఆవేదన

విశాలాంధ్ర - టెక్కలి: మా బడి మాకు కావాలని, తమ గ్రామంలో ఉన్న పాఠశాలలోనే చదువుకునే అవకాశం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తొలుసూరుపల్లి గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో క్రమేపి విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఆ పాఠశాలను సమీపంలో ఉన్న పాఠశాలకు విలీనం చేయాలని విద్యాశాఖ అధికారులు చూస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. సుమారుగా తమ గ్రామంలో 30 నుండి 40 సంవత్సరాలుగా ఈ బడి ఉందని గుర్తు చేసుకుంటున్నారు. మా గ్రామ పాఠశాలలో ఎంతోమంది చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సంపాదించి ఉన్నత స్థాయిలో ఉన్నారని చెబుతున్నారు. ఇలాంటి బడిని నేడు విద్యార్థుల సంఖ్య తగ్గిందని గ్రామంలో ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలకు పంపి విలీనం చేయవద్దని, మా గ్రామ పాఠశాలను మూసివేయొద్దని స్థానిక గ్రామస్తులు ప్రభుత్వానికి, ఉన్నత అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. గ్రామాన్ని విడిచిపెట్టి వేరే పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందని దుఃఖిస్తున్నారు. అసలు ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రైవేటు సంస్థల స్కూలుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రైవేటీకరణ చేసే విధంగా మారుస్తున్నారని వాపోతున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికల్లా విద్యార్థుల సంఖ్య పెంచుతామని, మా పాఠశాలను వేరే పాఠశాలతో విలీనం చేయకుండా... మా పాఠశాలను మా గ్రామంలోనే కొనసాగించి, విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చిన్నారికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి: కొఠారి గ్రామానికి చెందిన బండారు పావని కుమార్తె దీయా అనే 1 సంవత్సరం 6 నెలల చిన్నారి న్యూమోనియో వ్యాధితో బాధపడుతుంది. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్పై వైద్యం అందిస్తున్నారు. తల్లిదండ్రులు నిరుపేద కుటుంబం కావడంతో మెరుగైన వైద్యం కోసం దాతల సహకారాన్ని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు ఆ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సరస్వతి, భవిత, భూపతి రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారుల వ్యాక్సినేషన్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డా. మేరీ కేథరిన్

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ మేరీకేథరిన్ సోమవారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులను, మందులను పరిశీలించారు. ఫీల్డ్‌కి వెళ్లరు.. ప్రజారోగ్యం పట్టించుకోరు అనే కథనంపై విశాలాంధ్రలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి విచారణ చేపట్టారు. ఏదైతే నలుగురు చిన్నారులకు టీకా వేయడంలో నిర్లక్ష్యం వహించిన ఆశా ధనలక్ష్మి, వైద్య సిబ్బందిపై వివరాలు సేకరించారు. చిన్నారులకు వ్యాక్సిన్ మిస్ అయి ఉంటే స్పెషల్ డ్రైవ్ పెట్టి వ్యాక్సినేషన్ చేయాలని ఆదేశించారు. చిన్నారులకు వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫీల్డ్ స్టాప్ ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాలని సూచించారు. అయితే విచారణకు డిప్యూటీ డిఎం హెచ్ ఓ వస్తున్నారని ముందే తెలిసినప్పటికీ ఫీల్డ్ స్టాప్ ఫీల్డ్‌కి వెళ్లకుండా ఆస్పత్రిలో ఉండడం గమనార్హం. ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తంగా అందుబాటులో ఉండి ప్రజలకు సరైన వైద్యం చేయాలని, అదేవిధంగా మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిపై డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మేరీ కేథరిన్‌కు విలేకరులు వివరణ అడుగగా, మరోసారి చిన్నారుల వ్యాక్సినేషన్ నిర్లక్ష్యంపై పూర్తి వివరాలు సేకరించి చర్యలు చేపడతామని తెలిపారు.

రైతుల ఖాతాల్లో 5-6 గంటల్లోనే ధాన్యం సొమ్ము జమ

- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రైతాంగానికి సహాయం, భరోసా, నమ్మకం కలిగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో కాకుండా, కేవలం ఐదు నుంచి ఆరు గంటల్లోనే వారి ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పునరుద్ఘాటించారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్, వివిధ రైతు సంఘాలు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రతిదీ పారదర్శకంగా జరగాలని, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రైతుల వద్ద 80 కేజీల తూకం ఉన్నచోట 75 కేజీలుగా నమోదు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రైతులకు అన్యాయం చేయొద్దని స్పష్టం చేశారు. తేమ శాతం పరీక్షల్లో ఏకరూపత కోసం రైతు సేవా కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద ఒకే కంపెనీకి చెందిన యంత్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి చరిత్ర సృష్టించబోతున్నామని మంత్రి ప్రకటించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలలో గతంలో 11.45 లక్షల టన్నులు కొనుగోలు చేయగా, ఈసారి లక్ష్యాన్ని 13 లక్షల టన్నులకు పెంచినట్లు తెలిపారు.

నూరు శాతం సబ్సిడీతో రైతులకు టార్పాలిన్లను అందిస్తామని, శ్రీకాకుళంలో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అకాల వర్షాలతో రైతు తక్కువ ధరకే అమ్మాల్సిన పరిస్థితి లేకుండా కనీస మద్దతు ధర ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలోనే 41,000 పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, 400 కి పైగా వసతి గృహాలలో మంచి బియ్యంతో నాణ్యమైన భోజనాన్ని అందించడం కూటమి ప్రభుత్వానికి మరింత ప్రతిష్టను, సంతృప్తిని ఇస్తుందని, ఇది ప్రభుత్వ ప్రాథమ్యాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, చైర్మన్, ఎండీ మనజీర్ జీలానీ సమూన్, డైరెక్టర్ గోవిందరావు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిన రమేష్, కార్యదర్శి శాసనపురి మురళీ కృష్ణ, చైతన్య ప్రభు, తంగుడు నాగేశ్వరరావు, లాడే రమేష్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ వివేకానంద

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాల బారిన పడకుండా భవిష్యత్తుకు బంగారు బాటలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద విద్యార్థులకు సూచించారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి పిలుపుమేరకు శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక సన్ డిగ్రీ, పీజీ కళాశాలలో హలో యువత మేలుకో, మత్తు పదార్థాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో స్టాఫ్ డ్రగ్స్.. స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ చెడు అలవాట్లు మొదట సరదాగా ప్రారంభమై తర్వాత వ్యసనంగా మారి జీవితాలను బలిగొంటాయన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం పడుతున్నటువంటి కష్టాన్ని గుర్తించాలని, మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్ర బాబులు మాట్లాడుతూ అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కేవలం నిరుద్యోగ సమస్య, యువకులు ఎదుర్కొన్నటువంటి సమస్యలు, విద్యార్థుల సమస్యలపై పోరాటమే కాకుండా హలో యువత మేలుకో యువత అంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మత్తు పదార్థాల వినియోగాన్ని విక్రయాలను ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమాజ హితానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సన్ విద్యాసంస్థల చైర్మన్ జయరాం మాట్లాడుతూ నేడు యువత సోషల్ మీడియా, మత్తు పదార్థాల ద్వారా చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటుందని, ఆ విధంగా కాకుండా దేశభావి భారత పౌరులుగా దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్ కుమార్, కొన్న శ్రీనివాసరావు, నగర కన్వీనర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్టి 2.0పై సెమినార్

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిఎస్టి 2.0పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎల్.త్రినాథ్ మాట్లాడుతూ పరోక్ష పన్నుల సంస్కరణలో భాగంగా భారత ప్రభుత్వం జీఎస్టీ 2.0ని అమలు చేస్తుందని, దీనివల్ల వ్యవస్థలో ప్రతి ఒక్కరిపై ఆర్థిక భారం తగ్గి, కొనుగోలు శక్తి పెరిగి, ప్రజల పొదుపు పెరిగి, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని అన్నారు. వస్తు సేవల ధరలు తగ్గడం వల్ల ఒకవైపు వినియోగం పెరిగి మరోవైపు పొదుపు కూడా పెరుగుతుందని, దీనివల్ల 2047 నాటికి ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మొదటి స్థానానికి పోటీ పడుతుందని తెలిపారు. ఎంఈఓ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ ముఖ్యంగా జిఎస్టి సంస్కరణ ఫలితాలపై విద్యార్థులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వై.వరప్రసాద రావు, అధ్యాపకులు జే.పాపారావు, జీ.విష్ణు మూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీను బాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన, జనార్దన్ రావు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి చదరంగం పోటీలు

విశాలాంధ్ర-టెక్కలి/శ్రీకాకుళం స్పోర్ట్స్: ఈ నెల 26వ తేదీన టెక్కలిలోని ఆల్ఫాజెన్ స్కూల్ వేదికగా జిల్లాస్థాయి స్కూల్స్ చదరంగం పోటీలు నిర్వహించబడుతుందని, ఈ పోటీలకు జిల్లా లోని అన్ని పాఠశాలలు నుండి క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులు 300/- రూపాయలు ప్రవేశ రుసుం చెల్లించాలని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 99125 59735, 949180 2386ను సంప్రదించాలని అన్నారు. పాల్గొనబోయే క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్, అలాగే గెలుపొందిన క్రీడాకారులకు 10,000 రూపాయల నగదు బహుమతులు ఇవ్వబడుతుందన్నారు.

నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో గత రెండు సంవత్సరాలుగా చనిపోయిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి ఔట్సోర్సింగ్ విధానంలో ఉపాధి కల్పించాలన్నారు. 12వ (పి.ఆర్.సి)ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలన్నారు. 2011 నుంచి జనగణన జరగనందున, ప్రాంతాల విస్తీర్ణం పెరిగినందున ఆయా మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలలో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. డైలీ వెజ్ కార్మికులను ఔట్సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు సత్వరం విడుదల చేయాలని, ప్రస్తుతం మున్సిపల్ కార్మికులకు సంబంధించి ఉన్న బ్యాంక్ ఖాతాలను బలవంతంగా యాక్సిస్ బ్యాంకులోకి మార్చవద్దన్నారు. కార్మికులపై ఒత్తిడి తెస్తున్న మున్సిపల్ కమిషనర్ పై చర్యలు చేపట్టాలని, 2023 నాటి ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్ ఆఫ్ నేచర్ బట్టి ప్రస్తుతం పని చేస్తున్న ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది, స్కూల్ స్వీపర్లు వంటి వారికి వేతనాలు పెంచి చెల్లింపు చేపట్టాలన్నారు. ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల వలె 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాల పదవీ విరమణ వయసుకు పొడిగించాలన్నారు. లేనటువంటి పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నవంబర్ 3న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు డి.రమణ, ఆర్.గణేష్, సీతమ్మ, రామచంద్ర, డిల్లి సోషల్ మీడియా ప్రతినిధి అరుగుల రమణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదుకు ఇంటింటికీ జనసేన

విశాలాంధ్ర-కవిటి: ప్రజా సమస్యలపై ఫిర్యాదుకు ఇంటింటికీ జనసేన రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా ఇద్దివానిపాలెం పంచాయితీ పరిధిలో జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఇద్దివాని పాలెం గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయం నుండి స్థానిక జనసైనికులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో గల పాండురంగ వీది నందు ప్రజాసమస్యలు పై పిర్యాదులు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు దాలయ్య మాస్టారు, వీరమహిలలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ ధరల తగ్గింపుపై అవగాహన ఉండాలి

- అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు భాగంగా తీసుకువచ్చిన జిఎస్‌టి 2.0 ధరల భారం తగ్గింపుపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన ఉండాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గోండు శంకర్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ మున్సిపల్ హై స్కూల్ మైదానం నుండి డే అండ్ నైట్, రామలక్ష్మణ, సూర్య మహల్ జంక్షన్ మీదుగా సెవెన్ రోడ్ కూడలి వరకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఈ నెల13 తేదీ నుంచి నవంబర్ 19 వరకు నెలరోజులపాటు జిఎస్‌టి 2.0 సూపర్ జీఎస్ టి ధరల తగ్గింపుపై ప్రత్యేక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. జీఎస్టీ 2.0 పన్ను సంస్కరణల ద్వారా ఇటీవల అమలులోకి వచ్చిన పన్ను రేట్ల తగ్గింపుల ఫలితంగా అనేక వస్తువుల ధరలు తగ్గాయని తద్వారా సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రజలకు ఆర్థిక భారం తగ్గి, విజయదశమి - దీపావళి పండుగలను మరింత ఆనందంగా చేసుకునే సువర్ణ అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించాలని పాత జి ఎస్ టి ధరలు కాకుండ కొత్త పద్ధతి ధరల తగ్గింపు ప్రకారం కొనుగోలు అయ్యే విధంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోటల్ అసోసియేషన్స్, కార్మిక శాఖ, హోల్ సేల్ విభాగ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని అరికట్టాలి: పేరాడ

విశాలాంధ్ర-టెక్కలి: నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని సుమారు 6000 కోట్ల విలువ చేసే నకిలీ మద్యం తయారు చేయడంపై సీబీఐ విచారణ జరిపించాలని దీని వెనుక ఉన్న వారిని శిక్షించాలన్నారు. మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు, స్పెషల్ స్క్వాడ్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్ల కల్తీ మద్యం, నాటు సారా పెరిగిపోయి ఎంతోమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్న నియోజకవర్గంలో కింజరాపు కుటుంబం కన్నన్నలలో 1000 పైచిలుకు బెల్ట్ షాపులు ఉన్నాయని, అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్ షాపులు లేవనడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ప్రస్తుతం ఉన్న ఎక్సైజ్ శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఎక్సైజ్ అధికారి సీఐ మేరా సాహెబ్ కు వినతి పత్రాన్ని వైసీపీ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొండు చాందిని, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి,నాలుగు మండలాల మహిళా అధ్యక్షురాలు మెట్ట ఈశ్వరమ్మ, పోలాకి లక్ష్మీ, నాయకులు దుబ్బ వెంకటరావు, హేమసుందర్ రాజు, సత్తారు సత్యం, ఎర్ర చక్రవర్తి, కోత సతీష్, నూక సత్యరాజు, తమన్నగారి కిరణ్, గురునాద్ యాదవ్, పోలాకి మోహన్, వెంకటేశ్వరనాయుడు, బుడ్డ మోహనరెడ్డి, పేడాడ రమేష్, వాకాడ శ్రీధర్ రెడ్డి, చిన్ని జోగారావు, కర్ణిక జీవన్, అంబోడి విష్ణు, జనార్ధన్ రెడ్డి, యస్. వినోద్, మార్పు నాగభూషనరావు, పంగ రామయ్య, పేడాడ వెంకటరావు, ఆట్ల రాహుల్, బందపల్లి రాకేష్, ఫాల్గుణరావు, నీలకంఠం, దక్క రామక్రిష్ణ, బొడ్డు అప్పన్న, మెండ తాతయ్య, శివారెడ్డి, బర్ల కార్తీక్, బొమ్మాళి గున్నయ్య, దివ్వెల పోలయ్య, దల్లి లోకేష్, కాళ్ళ సంజీవ్, పొన్నాడ మోహన్, బొడ్డు చెంచులు, గుంట సోమేష్ పాల్గొన్నారు.

వడ్డీతాండ్ర - రావివలస రహదారి మరమ్మతులకై వినతి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: వడ్డీతాండ్ర రావివలస మధ్యలో గల రహదారి పూర్తిగా పాడైందని, దీనిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, రావివలస వడ్డీ తాండ్ర రోడ్డు సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం ఆర్డీఓకు వినతి పత్రం అందించారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల్లో భాగంగా టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తిని సభ్యులతో కలిసి రహదారి పరిస్థితిని, ప్రాముఖ్యతను వివరించారు. బ్రిటిష్ కాలంలో బ్రిటిష్ వారు గోర్జిగా ఉన్న ఈ రహదారి వెంబడి డోలా నుండి టెక్కలి వరకు జంతువుల ద్వారా వాణిజ్య కార్యకలాపాలు సాగించే వారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎంతటి ప్రాచుర్యం కలిగిన ఈ రోడ్డు వెంబడి కనీసం కాలినడకన వెళ్లడానికి కూడా వీలు లేని విధంగా పాడైపోయిందని, దీని వెంబడ ఆటోలపై ప్రయాణి కులను తరలించేందుకు ఆటో డ్రైవర్లు సైతం ఆటోలు పాడైపో తాయని భయంతో సర్వీసులు చేయడానికి భయపడుతున్నారని వివరించారు. కలియుగ కైలాసంగా పేరుగాంచిన రావివలస గ్రామములో వెలసిన శ్రీ ఎండల మల్లికార్జున స్వామి వారి దేవాలయం ఈ రోడ్డుకు ఆనుకొని ఉందని, స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చేవారికి సంతబొమ్మాలి, టెక్కలి మండలాలను కలిపే ఈ రహదారి ఆధారమని పూర్తిగా పాడైపోవడం వల్ల భక్తులు రాలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని వారు వివరించారు. కాకరపల్లి తంపర ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 6000 ఎకరాలు వరి పంట ముంపునకు గురైందని దీని ప్రధాన కారణం మూలపేటలో పోర్ట్ కొరకు నిర్మించిన రైల్వే రోడ్డు రాజపురం వద్ద తంపరలో అడ్డంగా నిర్మించిన రోడ్డు కారణమని వారు తెలిపారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు బీవీ రెడ్డి బాబు, సీనియర్ సిటిజన్ కోత చిన్న బాబు, అప్పన్న మల్లికార్జున స్వామి ఆటో డ్రైవర్ ఓనర్స్ అండ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు జి.చిరంజీవి, సామ కుమార్ పాల్గొన్నారు.

THE II ADDL. JUNIOR CIVIL JUDGE COURT - CUM - SPL. MOBILE COURT AT SRIKAKULAM.
O.S.NO: 534 OF 2024

Between:
Sri. Chiti Ravi Kumar
....plaintiff
And:
Sadu Kameswara Rao & another
..Defendants
To,
D.2. Sadu Srinivasa Rao,
S/o Late Krishna Murthy, Aged about 41 years, Occ. Agriculture, R/o H.No.6-44, Sadupeta Village, Mofusbandar post, Srikakulam Mandal & District.

పై దావాను వాది పెర్మనెంట్ ఇంజక్షన్ మంజూరు చెయ్యమని దాఖలు చేసియున్నారు. సదరు దావ నందు ప్రతివాదీ నెం.2కు సమన్లు కోర్టు వారు జారీ చేసితిరి. కనుక తేది 28-10-2025 ఉదయం 10.30 గం.లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు కావలయును. లేనిచో మీ పరోక్షములో పై దావాను కోర్టు వారు విచారణ చేయుదురు.

శ్రీకాకుళం
తేది:13-10-2025

Anil Kumar Gora,
Advocate, Srikakulam Town & District
Ph: 9440503849/8309623414
వాదితరపు న్యాయవాది

పాఠ్యపుస్తకాలను సక్రమంగా పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-కవిటి : రెండో విడత ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు సక్రమంగా పంపిణీ చేయాలని ఏపీటీఎఫ్ 1938 అధ్యక్షులు బల్ల ధర్మారావు, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో పాఠ్యపుకాల పంపిణీని పరిశీలించి పలు పాఠశాలలకు పుస్తకాలు అందజేశారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు అనుగుణంగా పుస్తకాలు అందజేయాలని ఎంఈవో ధనుంజయ మజ్జిని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ సభ్యులు మెర్రి గోపి, కార్యవర్గ సభ్యులు శ్రీరామ మూర్తి బిసాయి, భార్గవ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీతాండ్ర, రావివలస రహదారి మరమ్మతులు చేపట్టండి

- ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆరవి రోడ్డు సాధన కమిటీ వినతి

విశాలాంధ్ర-టెక్కలి : వడ్డీ తాండ్ర రావివలస మధ్యలో గల ఆర్ అండ్ బి రహదారి పూర్తిగా పాడైందని, దీనిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, రావివలస వడ్డీ తాండ్ర రోడ్డు సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదన్ రావు అధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల్లో ఆర్డిఓ కృష్ణమూర్తిని సభ్యులతో కలిసి కోరారు. బ్రిటిష్ కాలంలో బ్రిటిష్ వారు గోర్జి గా ఉన్న ఈ రహదారి గుండె డోలా నుండి టెక్కలి వరకు జంతువుల ద్వారా వాణిజ్య కార్యకలాపాలు సాగించే వారిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎంతటి ప్రాచుర్యం కలిగిన ఈ రోడ్డు వెంబడి కనీసం కాలినడకని వెళ్లడానికి కూడా వీలు లేని విధంగా పాడైపోయిందని, దీని వెంబడ ఆటోలపై ప్రయాణికులను తరలించేందుకు ఆటో డ్రైవర్లు సైతం ఆటోలు పాడైపోతాయని భయంతో సర్వీసులు చేయడానికి భయపడుతున్నారని వివరించారు. కలియుగ కైలాసంగా పేరుగాంచిన రావివలస గ్రామములో వెలసిన శ్రీ ఎండల మల్లికార్జున స్వామి వారి దేవాలయం ఈ రోడ్డుకు ఆనుకొని ఉందని, స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చేవారు సంతబొమ్మాలి, టెక్కలి మండలాలను కలిపే ఈ రహదారి ఆధారమని పూర్తిగా పాడైపోవడం వల్ల భక్తులు రాలేకపోయిన



పరిస్థితి ఏర్పడిందని వారు వివరించారు. పూర్తిగా రోడ్డు గతకల మయంగా ఉన్నందున తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు ఇటీవల కాలంలో ఒకరు మరణానికి కారణమైందని వారు విన్నవించారు. ఈ ప్రాంత ప్రజలపై దయవుంచి ఈ రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలో మీ రోడ్డును సందర్శిస్తానని, తరువాత ప్రజా ప్రతినిధులతో, సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మత్తులు చేపట్టే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. సంతబొమ్మాలి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపు గురైన వరి పంటకు నష్టపరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ ను కోరారు. సొంతబొమ్మాలి మండలంలో పలు ప్రాంతాల్లో సహా కాకరపల్లి తంత్ర ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 6000 ఎకరాలు వరి పంట ముంపు గురైందని దీని ప్రధాన కారణం మూలపేటలో పోర్ట్ కొరకు నిర్మించిన రైల్వే రోడ్డు రాజపురం వద్ద తంపరలో అడ్డంగా నిర్మించిన రోడ్డు కారణమని వారు తెలిపారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మిమ్మల్ని కూడా గతంలో తెలియజేయడం జరిగిందని ఖరీఫ్ మొదట్లో వచ్చిన ముంపు వలన పూర్తిగా పాడైపోయిందని మిగిలినవి ఇప్పుడు పొట్టతో ఉన్న వరి పంటను కూడా ఇప్పుడు నాశనం అయిందని దీనిపై తగు చర్యలు తీసుకొని పోర్ట్ యాజమాన్యం నుండి రైతులకు నష్టపరిహారం ఇప్పించే విధంగా చూడాలని వారు కోరారు. గతంలో ఈస్ట్ కో ఎనర్జీ వారు నిర్మించిన కాకరాపల్లి థర్మల్ పవర్ ప్లాంట్ కారణంగా రైతులకు పంట పొలాలకు ముంపును గురైన దానిపై గతంలో అధికారులు నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి రోడ్డు సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదన్ రావు తోపాటు సభ్యులు బీవీ రెడ్డి బాబు, సీనియర్ సిటిజన్ కోత చిన్న బాబు, అప్పన్న మల్లికార్జున స్వామి ఆటో డ్రైవర్ ఓనర్స్ అండ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు జి చిరంజీవి, సామ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు బాధ్యత

- బావితరాలకు చిన్నారులకు మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే
- సహనంతో ప్రేమతో పిల్లల మనసు దోచేది ఉపాధ్యాయులు మాత్రమే
- అందుకే సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మంచి గౌరవం

విశాలాంధ్ర-కవిటి: తల్లిదండ్రులు తొలి గురువులు అయితే ఉపాధ్యాయులు రెండో గురువుగా చెప్పవచ్చు. ముందుగా విద్యార్థి తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రవర్తించే తీరు. విద్యార్థుల పైన 80 శాతం ప్రభావం ఉంటుంది. 20 శాతం మాత్రమే తరగతి గదిలో ఉపాధ్యాయుని ప్రభావం ఉంటుందని చెప్పవచ్చు. కానీ నేటి సమాజంలో పరిస్థితులు భిన్నంగా మారాయి. తరగతి గదిలో విద్యార్థులకు మందలించకూడదు, కొట్టకూడదు తో పాటు అనేక ఆంక్షలు మధ్య విద్యా బోధన చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నిబంధనలతో ఎక్కువమంది విద్యార్థులు ఇంటి వద్ద తల్లిదండ్రుల భయం లేక పాఠశాలలో ఉపాధ్యాయుల భయం లేక తప్పుడు దారులు ఎంచుకుంటున్నారు. దీంతో పోలీసు వ్యవస్థకు చెప్పే పరిస్థితి నెలకొంది. పూర్వ పద్ధతిలో విద్యా బోధన జరిగితే భావితరాలకు బంగారు బాటలు వేసే అవకాశం ఉంటుందని పలువురు ప్రముఖులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతి విద్యార్థి ఆటపాటలతో ప్రేమతో అక్కున చేర్చుకుని ఓపిక సహనంతో పాటుగా ప్రేమతో పిల్లల మనసు దోచిన వాతావరణాన్ని తరగతి గదిలో సృష్టించి విధ్యాదానం చేసేది కేవలం ఒక్క ఉపాధ్యాయునికే సాధ్యపడుతుంది. ఏనాడైతే ఉపాధ్యాయుని చేతిలో బెత్తం దూరమైందో అప్పటినుండే విద్యా వ్యవస్థలో అధిక శాతం విద్యార్థులు తప్పు దోవపడుతున్నారు. తల్లిదండ్రుల భయం లేక ఇటు ఉపాధ్యాయులు భయం లేక విచ్చల విడితనంతో వ్యవహరిస్తూ చెడు ప్రవర్తన కలిగిన వారితో అడుగులు వేస్తూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. పోలీసులకు తలనొప్పి తగ్గాలంటే ఉపాధ్యాయుని చేతిలో బెత్తం ఉండాల్సిందని చాలామంది ప్రముఖులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి పాఠశాలలో ప్రతిరోజు ఉండే తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు చెప్పే ఫిర్యాదు ఈ విధంగానే ఉంటాయి.

సార్/మేడమ్... మా పాప ఎంత చెప్పినా వినట్లేదు. రాత్రి పదిన్నర వరకూ టీవీ చూస్తూనే ఉంటోంది. కొంచెం భయపెట్టండి' అంటూ ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారిని స్కూల్లో దింపడానికి వచ్చిన నాన్న టీచరుకు ఫిర్యాదు చేశాడు. మేడం, మా అబ్బాయి హోంవర్క్ సరిగా చేయట్లేదు. ఎంతసేపూ ఫోన్లో వీడియో గేమ్స్ ఆడటం మీదనే ధ్యాస ఉంటోంది. కొంచెం గట్టిగా చెప్పండి. అవసరమైతే రెండు తగిలించండి'. ఇది మూడో తరగతి చదువుతున్న హరి మీద టీచరుకు వాళ్ల అమ్మ ఇచ్చిన ఫిర్యాదు. ఈ ఫిర్యాదులు కల్పితాలు కావు. ప్రతి బడిలో సర్వసాధారణంగా వినిపించేవే. అయితే ఏంటి తమ పిల్లల బాగు కోసం తల్లిదండ్రులు టీచర్లను అభ్యర్థిస్తున్నారు. అందులో తప్పేముంది, అనుకుంటే పొరపాటే పిల్లల గురించి మనం చేసే ఆ ఫిర్యాదు ద్వారా మన వ్యక్తిత్వం, జీవనశైలి, పిల్లల ఎదుగుదల పట్ల మనం ఎంత బాధ్యతతో లేదా బాధ్యతా రాహిత్యంతో మెలగుతున్నాం. ఇలా అనేక విషయాలు టీచర్లకు అర్థమవుతాయి. ఉదాహరణకి, 'మా పాప అదేపనిగా టీవీ చూస్తోంది' అని ఫిర్యాదు చేసినప్పుడు, 'దీనికి నేనేం చెయ్యగలను, ఇంట్లో ఎనిమిదిన్నరకే టీవీ కట్టేసి, లైట్లు ఆర్పేసి అందరూ పడకగదిలోకి చేరితే సరిపోతుంది కదా, ఇంతోటి దానికి నేను భయపెట్టడమేంటి, అని టీచరు మనసులో అనుకుంటారు. అలానే, ఫోను చూస్తూ హోంవర్క్ మీద శ్రద్ధ పెట్టడం లేదు' అని చెప్పినప్పుడు, 'ఆ ఫోను పిల్లాడి చేతికిచ్చి అలవాటుచేసింది మీరే కదా, మీరు ఫోను అందుబాటులో ఉంచుతున్నప్పుడు, నేను మందలించినా ఏం ఉపయోగం, అని టీచరు అనుకుంటారు. అయితే, ఇవన్నీ వారు అమ్మానాన్నలకు చెప్పరు. వాళ్లు వెళ్లిపోయాక తోటి టీచర్లకు చెప్పుకొని నవ్వుకుంటారు. అమ్మానాన్నలను ఏమీ అనలేక, 'ఇంట్లో పెద్దలు మారరు కానీ, మనం భయపెట్టాలంట' అంటూ విసుక్కుంటారు. ఆ చిరాకు వెంటనే ఆయా పిల్లల మీదికి మళ్లుతుంది. తల్లిదండ్రులకే వీళ్లమీద శ్రద్ధలేనప్పుడు నేను మాత్రం వీళ్లకోసం ఎందుకు తాపత్రయపడాలి' అని ఆ పిల్లలను నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా నష్టపోయేది పిల్లలే. పిల్లల పెంపకం అన్నది ఇద్దరి బాధ్యత. ఒక చెయ్యి అమ్మానాన్నా అయితే మరో చెయ్యి ఉపాధ్యాయులు. రెండు చేతులు కలిస్తేనే పిల్లలు రత్నాల్లా వెలుగుతారు. ఇంటి దగ్గర పిల్లల అలవాట్లను సరిచేసుకోవాల్సిన బాధ్యత అమ్మానాన్నలదే. టీవీ చూస్తున్నారు, ఫోన్లో ఆడుతున్నారు. అంటే అవి లేకుండా సమయాన్ని ఎలా గడపాలో పిల్లలకి మనం తెలియజేయట్లేదనే అర్థం. మరేం చెయ్యాలి. పిల్లలతో కలిసి ఆటలు ఆడాలి, వాళ్లకి కథలు చదివి వినిపించాలి. ఫోను, టీవీల పాత్రని అమ్మానాన్నలు తమ ప్రేమతో భర్తీ చెయ్యాలి. అంతేకానీ, ఆ బాధ్యతని కూడా టీచరు చేతిలో పెడితే, అది గౌరవం అనిపించుకోదు. ముందు విద్యార్థుల తల్లిదండ్రుల్లో మార్పు రావాలి.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

విశాలాంధ్ర-కవిటి : ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్. రామకృష్ణలు అన్నారు. ఈ మేరకు సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఇటీవల డీఎస్సీలో ఎంపికై మండలానికి వచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను బోధనతో ఆకట్టుకోవాలని, వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తమదేనని సూచించారు. వారికి కేటాయించిన పాఠశాలలకు పంపించడం జరిగింది. కవిటి మండలంకు 126 ఖాళీలకు గాను ఎస్జీటీలు 20, స్కూల్ అసిస్టెంట్లు 79, ఎస్జిటి ఒరియా మీడియంకు 6, మొత్తం 85 మంది ఉపాధ్యాయులు వచ్చారు. వారిని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చాణిక్య, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, రుంకు కృష్ణా రావు, తెప్పల రవి, మొర్రి గోపి, గార రాంబాబు, గుడియా వంశీకృష్ణ, కోళ్ల ప్రకాష్, కె.టీ లింగరాజు, సవర మురళీధర్లు అభినందించారు.

6 గురు కొత్త ఉపాధ్యాయులు చేరిక



కవిటి: కవిటి మండలం బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం 6 గురు కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. వారికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. వీరు రాకతో పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారని 10వ తరగతిలో శత శాతం ఫలితాలకు కృషి చేస్తామని హెచ్ఎం. ఎస్.రామకృష్ణ తెలిపారు. వారిని ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఫిర్యాదులు స్వీకరణలో 50 వినతలు స్వీకరణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: తప్రజా పిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలి అని, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో (పిజిఆర్ఎస్) స్వీకరించే ఫిర్యాదులు పరిష్కారానికి శ్రద్ధ వహించి ఆయా పిర్యాదులు కు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో అదనపు ఎస్పీ 50 మంది, ఫిర్యాదుదారులు నుంచి వినతలు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియపరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. వృద్ధులు, వికలాంగుల అర్జీ దారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఎస్పి పి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

ఐతమ్ బోధకులు స్మితరాణి సాహుకు పీహెచ్‌డీ పట్టా

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలోని ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటి విభాగ అధ్యాపకులు స్మితరాణి సాహుకు ఒడిశా లోని రూర్కెలా కు చెందిన బిజు పట్నాయక్ విశ్వా విద్యాలయం నుంచి టెక్నిక్స్ ఆన్ ఇంటర్ వెహికలర్ కమ్యూనికేషన్ సిస్టమ్ వాహనాల మధ్య సమర్థవంతమైన కమ్యూనికేషన్ సాధన కోసం నూతన రూటింగ్ పద్ధతులను అభివృద్ధి, సమర్థవంతమైన మార్గదర్శక పద్ధతులు అనే ప్రయోగాత్మక పరిశోధనలో పి హెచ్ డి పట్టా ప్రదానం చేసినట్లు డైరెక్టర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఆ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి పరిశోధనల వల్ల భవిష్యత్ లో ఇంటర్ వాహిక్యులర్ స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంల అభివృద్ధికి ఉపయోగపడతాయని, పేర్కొన్నారు. డాక్టరేట్ పట్టా పుచ్చుకున్న స్మితరాణి సాహుకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు, ఐటీ హెచ్ ఓ డి డాక్టర్ బి.రమేష్ నాయుడు తదితర సిబ్బంది అభినందించారు.

ఐటీ విద్యార్థులకు సుప్రజా టెక్నాలజీస్ ఇంటర్న్‌షిప్ అవకాశాలు

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని ఐతమ్ కళాశాలలోని చివరి ఏడాది ఐటీ విద్యార్థులు, విజయవాడకు చెందిన ప్రముఖ ఐటి సంస్థ సుప్రజా టెక్నాలజీస్ సహకారంతో సైబర్ సెక్యూరిటీ లెవల్-2 హ్యాకథాన్ పై వారాంతర స్కిల్ అడ్వాన్స్‌డ్ కోర్స్ కు శిక్షణ పొందినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులు వల్నరబిలిటీ అసెస్‌మెంట్ పెనెట్రేషన్ టెస్టింగ్, వెబ్ అప్లికేషన్ పెనెట్రేషన్ టెస్టింగ్ వంటి సైబర్ సెక్యూరిటీ టెస్టింగ్ పద్ధతులపై ప్రాక్టికల్ అవగాహన పొంది, 12 మంది సైబర్ సెక్యూరిటీ మరియు డేటా సెక్యూరిటీ కోర్స్ లలో ఇంటర్న్‌షిప్ కు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు డైరెక్టర్ తోపాటు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావు , ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. రమేష్ నాయుడు, ఐఐసి హెడ్ డాక్టర్ జి. సతీష్ మరియు కోఆర్డినేటర్ సిహెచ్. చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

అలరించిన ఆలోచించండి ఏకపాత్రాభినయం

విశాలాంధ్ర-కవిటి: కంచిలి మండలం బూరగాం గ్రామంలో రైతుల ముఖ్యమైన పండగలలో ఒకటైన గౌరమ్మ మరియు నందిమ్మ సంబరాలు సందర్భంగా కవిటి మండలం బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు బాలక లోకనాథం ప్రదర్శించిన ఆలోచించండి ఏకపాత్రాభినయం అందరిని ఆకట్టుకుంది. గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం నకు ప్రముఖ కళాకారుడు బాలక లోకనాథము హాజరై ప్రస్తుతకాలంలో సమాజంనకు అవసరమైన వివిధ అంశాలు పైన ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేరీతిలో ఎంతో హాస్య భరితంగా నిర్వహిస్తూ అందరిని అబ్బురపర్చారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు మాట్లాడుతూ ఎక్కువగా చదువు యొక్క ఆవిశ్యకత గురించి విద్యార్థులు పైన చరవాణి యొక్క ప్రభావం ఏ విధంగా ఉంటుందో చక్కగా వివరించారు అన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాతిక వేత్త కప్ప మీనారావు ఆలపించిన భక్తి గీతాలు ఫోక్స్ సాంగ్స్ అందరిని అలరించాయి. గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ మాట్లాడుతూ బాలక లోకనాథము ఏకపాత్రాభినయం పాత్ర అద్భుతమని, సమాజమునకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో ఎంతో ఓపిక, పట్టుదల, కృషి, సహనంతో నిర్వహించడం ఆయనకే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బద్రి నాగేష్,కె ప్రకాష్,బి.చిన్నారావు, బి.గంగారావు, యం.శ్రీనివాసరావు, పి.కాంతరావు మాస్టర్ కళాకారుడు బాలక లోకనాథముకు సత్కారించారు. ఆయనతోపాటు విచ్చేసిన బెందాళం రాజేశ్ (క్యాసియో), బెందాళం పురుషత్తము (డోలక్)లను వక్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి... 5 వ్యక్తులు అరెస్ట్, నగదు స్వాధీనం

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం మాణిక్యపురం గ్రామం శివాలయం ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో సోమవారం ఉదయం పేకాట శిబిరంపై ఎస్ ఐ వి.రవివర్మ తన సిబ్బందితో కలిసి దాడి చేపట్టి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.10, 620 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న 5 గురు వ్యక్తులు పై కవిటి పోలీసు స్టేషన్లో ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో టెక్కలి తైక్వాండో క్రీడాకారుల హవా

విశాలాంధ్ర-టెక్కలి : బాపట్ల జిల్లాలో ఈ నెల 10,11 & 12 తేదీల్లో జరిగిన 69 వ రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటిల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా కేంద్రం చెందిన టైక్వాండో క్రీడాకారులు తమ సత్తాచాటేరు. అండర్ 14 బాలికలు విభాగంలో మెండ తపస్వి 35 కిలోలు విభాగం లో స్వర్ణ పతకం గెలుచుకొని నవంబర్ లో పంజాబ్ రాష్ట్రం లో లుధియానలో జర్గబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించగా, జనపాన అక్షయా 38o కిలోల విభాగం లో రజత పతకం, బాలుర విభాగంలో అట్టాడ మహీధర్ నాయుడు అండర్ 38 కిలోల విభాగంలో రజత పతకం మరియు వేములాడ వినయ్ అండర్ 41 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. ఈ విజయం పట్ల జిల్లా క్రీడా విభాగ అధికారి డాక్టర్ కళ్లేపల్లి శ్రీధర్ శిక్షకుడు (కోచ్) నర్సిపురం శేఖర్ మరియు విజేతలుకు అభినందనలు తెలపగా కోచ్ జగదీష్, సురేష్ సీనియర్ బ్లాక్ బెల్ట్ సాయి తరుణ్, అక్షా, సాగర్ మరియు గేయామృత లు విజయం పట్ల హర్షం వ్యక్తం జేశారు.

జీఎస్టీతో అన్ని వర్గాలకు మేలు

- ర్యాలీ నిర్వహించిన అధికారులు

విశాలాంధ్ర-కవిటి: ప్రభుత్వం ప్రకటించిన సూపర్ జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలం నుంచి రాజపురం, భైరిపురం వరకు జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే వ్యాపారస్తులు తమ దుకాణాలు వద్ద జీఎస్టీ ప్రకారం ధరల లిస్టు పెట్టాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వై.వరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు పొందల కృష్ణారావు, ఏపిఎం గోవిందరావు, ఏపీఓ టి.మోహనరావు, ఎస్బిఎం కోఆర్డినేటర్ సల్ల జీవన్, పంచాయితీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎంఎన్ఆర్జీఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.